క్లుప్తంగా

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

గన్నవరం: స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డి.బాబురావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్, తెలుగు వ్యాకరణం, చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజ్ఞాన శిబిరం జరుగుతుందన్నారు. పరిసరా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కంకిపాడు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ డి.సందీప్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు, గన్నవరం డీఎస్పీ ఆర్. జయసూర్య నిర్దేశకత్వంలో సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో దావులూరు టోల్‌గేట్ వద్ద పోలీసులు, కేంద్ర బలగాలు, ఎన్నికల ప్రత్యేక బృందాలు శనివారం వాహన తనిఖీలను నిర్వహించాయి. విజయవాడ–మచిలీపట్నం మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఐ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. నగదు, వస్తు సామగ్రి తరలింపులో సరైన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని, లేనిపక్షంలో నగదు, సామగ్రి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

సంక్షేమ రథసారథికి మళ్లీ పట్టం కట్టండి

అంబాపురం(విజయవారూరల్): అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న సంక్షేమ రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం అంబాపురం గ్రామం ఒకటో వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రతి ఇంటికీ జగనన్న సంక్షేమం ద్వారా అందిన లబ్ధిని ఓటర్లకు వివరిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో సింహాద్రి చంద్రశేఖరరావును, వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆపదలో ఉన్న వారికి నేను అండగా ఉంటానని భరోసా ఇస్తూ సహాయం అందచేస్తున్న వల్లభనేని వంశీని మరొకసారి గెలిపించుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అంబాపురం గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్ తెలిపారు. కార్యక్రమంలో వి.అరుణ్‌కుమార్, నవోదయ నర్సింగ్ కాలేజీ చైర్మన్ రవీంద్ర రెడ్డి, బడేటి బెనర్జీ, ఇందుపల్లి సురేంద్ర, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో పరీక్షలు రాసేందుకు వచ్చిన డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పటమటకు చెందిన విద్యార్థిని(20) పటమటలోని త్రివేణి కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఆమె ఈ నెల 26న పరీక్ష రాయటానికి పోరంకిలోని శ్రీ కృష్ణవేణి డిగ్రీ కాలేజీకి వచ్చి పరీక్ష రాసింది. ఆ తరువాత ఆమె తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ముగిసిన చిన్నారుల బైబిల్ తరగతులు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడ రోడ్డు ఇందిరానగర్‌లోని బేతేలు ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని చిన్నారులకు నిర్వహించిన బైబిల్ తరగతులు శనివారంతో ముగిశాయి. దీంతో హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో దాదాపు 500 చిన్నారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల్లో సత్ప్రవర్తన, దైవ భక్తి, సామాజిక స్పృహ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవ భావం, ఆధ్యాత్మికతను పెంపొందించే లక్ష్యంతోనే బైబిల్ తరగతులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బైబిల్‌లోని వాక్యాలు, విషయాలను చిన్నారులకు కథలు, ఆటలు, పాటల ద్వారా ఆసక్తికరంగా బోధించినట్లు వివరించారు. బాల్యంలో సరైన మార్గాన్ని అలవర్చినప్పుడే భవిష్యత్‌లోనూ అదే కొనసాగిస్తారని తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా విప్లవాత్మక పథకాలు

- సంక్షేమ పాలనకై మళ్లీ వైఎస్ జగన్‌కే పట్టం కట్టండి
- వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్



రంగన్నగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా విప్లవాత్మక సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు ప్రజలు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కోరారు. బాపులపాడు మండలం సింగన్నగూడెం, రంగన్నగూడెం గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఆయనకు ఎదురేగి సాదర స్వాగతం పలికారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి, పూలవర్షం కురిపిస్తూ వంశీమోహన్‌కి అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలో అడుగడుగునా ఆయనకు విశేష ఆదరణ లభించింది. రంగన్నగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రచార రథంపై నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ ప్రజలకు అభివాదం చేస్తూ గ్రామంలోని వీధుల్లో ప్రచారం చేశారు. సింగన్నగూడెం, రంగన్నగూడెంలో పార్టీలకు అతీతంగా ప్రజలు వల్లభనేని వంశీకి బ్రహ్మరథం పట్టారు. ప్రతి వీధిలోనూ మహిళలు మంగళహారతులు పడుతూ ఆయనపై అభిమానాన్ని చాటుకున్నారు. యువత బైక్ ర్యాలీ, మహిళల ఆనంద నృత్యాలతో వంశీ ప్రచారం ఉత్సాహంగా సాగింది. జై జగన్.. జై వంశీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయండి

దేశంలో మరెక్కడ లేనివిధంగా విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు పలకాలని వల్లభనేని వంశీ కోరారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, కాపు నేత్తం, వాహన మిత్ర, జగనన్న విద్యా దీవెన వంటి సంక్షేమ పథకాలు నిరాతంకంగా కొనసాగటానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని ఆయన చెప్పారు. మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా తీర్చిదిద్దటమే కాకుండా ఇంగ్లిష్ మీడియం, ఐబీ సిలబస్ అమలు చేస్తున్నారని, జగనన్న విద్యా కానుక అందిస్తున్నారని వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గన్నవరం ఎమ్మెల్యేగా తనకు, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని వంశీ కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు, పార్టీ నాయకులు చెన్నుబోయిన శివయ్య, సుదిమెళ్ల దానియేలు, గంధం నారాయణ, కాకాని సంజయ్ పాల్గొన్నారు.

సూరంపల్లిలో వంశీ ప్రచారం



మహిళలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న వంశీ

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ ప్రచారం నిర్వహించారు. స్థానిక యూకోబ్యాంకు, పంచాయతీ కార్యాలయం, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, యాదవుల బజారు ప్రాంతాల్లో వల్లభనేని వంశీ ముమ్మర ప్రచారం చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, గ్రామ కన్వీనర్ కందిమళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డప్పులు, మేళతాళాలతో ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. అడుగడుగునా వల్లభనేని వంశీ ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం రథంపై ముందుకు



సూరంపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న వంశీమోహన్

వెళ్లారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారానికి సూరంపల్లి గ్రామం బ్రహ్మరథం పట్టింది. అధిక సంఖ్యలో మహిళలు, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, పీఏసీఎస్ చైర్మన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, యూత్ విభాగం అధ్యక్షుడు ప్రత్తిపాటి రాజా, పార్టీ సీనియర్ నాయకులు బండి శివరామయ్య, పార్టీ నాయకులు పామర్తి మాధవరావు, పాలిమెట్ల జయరాజు, తోట నవీన్, రాయల మహేంద్ర, కందిమళ్ల రాఘవ, పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు పోలింగ్ కేంద్రాల గుర్తింపు



పెనమలూరు: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయటానికి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఏఆర్వో, తాడిగడప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన శనివారం పెనమలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి వివరాలు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ వచ్చే నెల 4, 5 తేదీల్లో జరుగుతుందన్నారు. 4వ తేదీన పీవోలు, ఏపీవోలు ఓటు వేయాలని, 5వ తేదీన ఎన్నికల విధుల్లో ఉన్న ఇతర సిబ్బంది ఓటు వేయాలని ఎన్నికల కమిషన్ తెలిపిందని చెప్పారు. ఈ మేరకు పెనమలూరు పాఠశాలలో 138, 140, 141, 142, 143, 144 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉన్న వారు పైన తెలిపిన పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

మే 6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మే 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమావళికి లోబడి ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల పరిషత్ పాదేశిక నియోజకవర్గ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు హాజరుకావాలని కోరారు.

మేనిఫెస్టోతో జగనన్న మరోసారి ప్రజల గుండెల్లో నిలిచారు



కానూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, జోగి రమేష్

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, జోగి రమేష్
- కానూరులో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

పెనమలూరు: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోతో జగనన్న మరోసారి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు అసెంబ్లీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. కానూరులో శనివారం రాత్రి ఎంపీ అభ్యర్థితో కలిసి జోగి రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే అని మరోసారి నిరూపించారన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోతో వచ్చే ఐదేళ్ల సంక్షేమ–అభివృద్ధి పాలన జగనన్న ప్రజలకు అందించనున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో అంటే ఏ భగవత్‌గీత, కురాన్, బైబిల్ వంటిదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కట్టుబడి చిత్తశుద్ధితో మ్యానిఫెస్టోలో ఉన్న హామీలు అమలు చేస్తారని, గతంలో కూడా రుజువు చేశారని తెలిపారు. జగనన్న మేనిఫెస్టోతో ఇప్పటికే ప్రజలందరూ ఒకే తాటిపైకి వచ్చారని, జగనన్నకు ఘన విజయం చేకూర్చిపెడతారని అన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ఉన్న కాలంలో ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రజలు అమలు చేయక ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కుప్పం నుంచి చంద్రబాబు, పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ ఓడిపోయి రాష్ట్రం వదిలిపోతారని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారని మంత్రి జోగి రమేష్ అన్నారు.

ప్రజా నాయకుడు జగన్

ప్రజానాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది రాజకీయ నాయకులను చూశామని, ఇచ్చిన మాటపై నిలబడే నాయకుడు జగన్ ఒక్కరేనని తెలిపారు. వైఎస్ జగన్ గతంలో ఇచ్చిన మాటపై నిలబడి సంక్షేమ పాలన అందించారని, ఇప్పుడు కూడా రానున్న ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పాలన అందిస్తారన్నారు. జగన్ పాలనలో సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. తాను ఏ గ్రామం వెళ్లినా ప్రజల నుంచి మంచి ఆదరణ కనిపిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రజల ఆత్మగౌరవం పెంచే విధంగా ఉందని చెప్పారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, దేవినేని గౌతమ్, చాంద్‌బాషా, సిద్దిఖ్, దేవినేని స్మిత, వేమూరి బాలకృష్ణ, బోర్రాకృష్ణ, అంగిరేకుల సీతారామయ్య, లతీఫ్, షాబు, శివరామకృష్ణ, కరీం, శ్రీరాములు, చినబాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజల్లో 'జోగి' కుటుంబం

- కుటుంబ సమేతంగా ఇంటింటి ప్రచారం
- అడుగడుగునా అపూర్వ ఆదరణ
- దిక్కుతోచని స్థితిలో కూటమి



ఉయ్యూరులో ప్రచారం నిర్వహిస్తున్న జోగి రమేష్ సతీమణి శకుంతలాదేవి



పునాదిపాడులో సంక్షేమ పాలన వివరిస్తున్న జోగి రమేష్ కుమార్తె రేష్మ ప్రియాంక

కంకిపాడు: నామినేషన్ల ఘట్టం పూర్తికావటంతో ప్రచార పర్వం మరింత ఊపందుకుంది. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీకి అడుగడుగునా ప్రజాదరణ లభిస్తోంది. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ జెండాకు బాసటగా నిలుస్తున్నారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ తో పాటుగా ఆయన కుటుంబం అంతా ప్రచారాన్ని సాగిస్తూ ప్రజలకు చేరువ అయ్యింది.

ప్రతి గడపకూ ప్రచారం..

రాష్ట్ర మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ ఇప్పటికే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాలకూ చేరువ అయ్యారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ, సొంత కుటుంబ సభ్యుడు అనిపించుకున్నారు. అందరూ సొంతవాడిగా అక్కున చేర్చుకుంటున్నారు. ఇదే క్రమంలో జోగి రమేష్, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుటుంబం కూడా ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తోంది. రమేష్ సతీమణి శకుంతలాదేవి, కుమారులు రాజీవ్, రోహిత్, కుమార్తె రేష్మ ప్రియాంక, ఇతర కుటుంబ సభ్యులు పార్టీ శ్రేణులను కలుపుకుని ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ఖచ్చితంగా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాల్సిన తరుణమని సూచిస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తున్నారు. కూటమి కుట్రల బారిన పడకుండా అవగాహన పెంపొందిస్తున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటుగా సిద్ధం సమావేశాలను ఊరూ వాడా నిర్వహిస్తూ సార్వత్రిక సమరానికి సన్నద్ధం చేస్తున్నారు.

అడుగడుగునా ఆదరణ..

సంక్షేమ అజెండా, వైఎస్సార్ సీపీ జెండాతో తమను ఆత్మీయంగా పలకరిస్తున్న జోగి రమేష్, ఆయన కుటుంబ సభ్యులను పెనమలూరు నియోజకవర్గ ప్రజానీకం అక్కున చేర్చుకుంటుంది. అడుగడుగునా బ్రహ్మరథం పడుతూ ఆదరిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలూ వెన్నుదన్నుగా నిలుస్తూ మద్దతు తెలుపుతున్నారు.

కూటమికి గుబులు..

వైఎస్సార్ సీపీకి ప్రజల్లో రోజు రోజుకీ పెరుగుతున్న ఆదరణ, మద్దతు చూసి కూటమికి గుబులు పట్టుకుంది. కూటమి నుంచి టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ పోటీలో ఉన్నారు. ప్రచారంలో మొక్కుబడిగా సాగుతున్నారు. జనసేన, బీజేపీ శ్రేణులు కలిసినా ఆశించిన స్థాయిలో ప్రచారం సాగకపోవటంతో అటు అభ్యర్థిలోనూ, ఇటు కూటమి శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది. ప్రచారంలో కిరాయికి తెచ్చుకున్నా జనం కదలకపోవటంతో దిక్కుతోచని పరిస్థితిగా మారింది. ఓటమి గుబులు కూటమిని కుంగదీస్తోంది.

ఓటర్ల ఇళ్లకు వెళ్లి స్లిప్‌లు అందించాలి



విజయవాడరూరల్: బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరు ఇంటికీ వెళ్లి ఓటరు స్లిప్‌లను అందజేయాలని గన్నవరం నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఏఈఆర్వో), మండల తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఆర్వో మాట్లాడుతూ.. వచ్చే నెల 5వ తేదీలోగా మండలంలోని ఓటర్లకు స్లిప్పులను అందజేయాలన్నారు. మండలంలో 43,271 మంది పురుష ఓటర్లు, 45,603 మంది మహిళా ఓటర్లు, నలుగురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని వారందరి ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్పులు ఇవ్వాలన్నారు. అదే విధంగా 82 పోలింగ్ కేంద్రాలుండగా ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో బూత్ స్థాయి అధికారి ఉన్నారని, ఓటరు స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.

యనమలకుదురులో ఎన్నికల ప్రచారం



యనమలకుదురులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జోగి రాజీవ్

పెనమలూరు: జగనన్నతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ అన్నారు. ఆయన శనివారం యనమలకుదురులో కొండ వెనుక ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు ఆపలేదని తెలిపారు. ఎవరు ఎన్నికుట్రలు పన్నినా సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. నేడు చంద్రబాబు ఆచరణయోగ్యం కాని పథకాలు ప్రకటించి ప్రజలను మరోసారి మోసం చేయటానికి కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలు గమనించి జగనన్నకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీనివాసరావు, కోసూరి నరేష్‌కుమార్, ఈడే గోపాలకృష్ణ, గుమ్మడి అన్వేష్, అనీల్‌రెడ్డి, అష్రఫ్, కార్యకర్తలు, రాజీనామా చేసిన వలంటీర్లు పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన



భరత నాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై చెన్నైకి చెందిన మైత్రి సెంటర్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన నృత్యకారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం మైత్రి సెంటర్‌కు చెందిన అధితి అరుణ్, దీక్షిక అరుణ్, ఆర్.స్వాతి, ఆర్.శ్వేత, బి.నివాసిని, ఆర్.శ్రీజ, గాయత్రి ఆనంద్, సాయిశ్రేయ, అభినయ, దీపిక పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

రాష్ట్ర ప్రజలంతా వైఎస్ జగన్ వెంటే ఉన్నారు



ఎనికేపాడులో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ పూర్ణచంద్రరావు, కోనేరు సబ్బారావు

రామవరప్పాడు: పేదల జీవితాల్లో సంక్షేమ పథకాల ద్వారా వెలుగులు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజలంతా ఉన్నారని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, నిడమానూరు, ప్రసాదంపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయన్ని కాంక్షిస్తూ శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎనికేపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు కోనేరు సుబ్బారావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులతో, ప్రసాదంపాడులో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, పలువురు నాయకులు, నిడమానూరులో పరిమి సింధూర ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఎనికేపాడులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్, సంక్షేమ పథకాలు కొనసాగింపునకు రాష్ట్ర ప్రజలు సీఎం జగనన్నకే మళ్లీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు కోనేరు సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. పేదల ప్రభుత్వం వైఎస్సార్ సీపీకే ప్రజా మద్దతు ఉందన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి బాటలో నడిపించిన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రసాదంపాడులో సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు దూరు రత్నం, పైలా లక్ష్మి, యూత్ నాయకులు పిన్నిబోయిన రవికుమార్, ఎనికేపాడులో మాదు సుబ్బారావు, ఎంపీటీసీలు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణాజిల్లా కలిదిండి మండలానికి చెందిన ఊసల భోగేశ్వరరావు, నాగమణి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వారి 8 ఏళ్ల కుమారుడు ఊసల దీక్షిత్ మెదడులో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి అది వెన్నుపూస వరకు చేరటంతో నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ వార్డ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బాలుడి తల్లిదండ్రులు దీవెన ఫౌండేషన్ సభ్యులను సహాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు పటమట కానిస్టేబుల్ రమణ, ట్రాఫిక్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుల్ బ్రహ్మం శనివారం హాస్పిటల్‌కు వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు బాధితుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

యాగశాలలో గణపతికి అభిషేకాలు, హోమం



గణపతి హోమంలో పాల్గొన్న ఈవో రామరావు దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై నూతన యాగశాలలో శనివారం గణపతికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. శనివారం ఉదయం యాగశాలలో గణపతి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చరణ, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారికి అర్చన నిర్వహించగా, ఆలయ ఈవో కేఎస్ రామరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ మూర్తి, కోట ప్రసాద్, మురళీధర్ శాస్త్రి, రఘునాథ శర్మ(పండు) అభిషేకాలు, పూజ, గణపతి మంత్ర హోమాలను జరిపించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం, వేద ఆశీర్వచనం, ప్రసాద వితరణ జరిగాయి. పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు.